

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి..

- వివరాలను ట్రాఫిక్ పోలీసులకు అందజేయాలి
- పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, జూలై 30: నగరంలో తిరిగే ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రైసిటీలో ఆటోడ్రైవర్లకు మంగళవారం ములుగు రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ.. ఖాకీ యూనిఫామ్ ధరించే పోలీసు, ఆటో డ్రైవర్లు ఇద్దరూ ప్రజలకు సేవలందించేవారేనని అన్నారు. నగరంలో చాలా మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎలాంటి బీమా వర్తించదన్నారు. ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో అలాంటి వారికి లైసెన్స్‌లు అందించేందుకు కృషి చేస్తాన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ట్రైసిటీకి వచ్చే ప్రయాణికులతో పాటు అర్ధరాత్రి ఆటోల్లో ప్రయాణించే వారిని క్షేమంగా వారి గమ్యస్థానాలకు తీసుకుపోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు రోడ్లపై ఇతర వాహనదారులను ఇబ్బంది పెట్టేవిధంగా ఆటోలను నడపడం, నిలపడం చేయొద్దని సూచించారు. ఆటో వెనుక భాగంలో పోస్టర్లను అతికించడం, ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు పెట్టి న్యూసెన్స్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలన్నారు. ఆటోడ్రైవర్లు చేసే చిన్న చిన్న పొరపాట్లవల్ల ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల వివరాలను సంబంధిత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో అందజేసే విధంగా ఆటో యూనియన్లు బాధ్యత తీసుకోవాలని సీపీ కోరారు.



ఆటోలో మరిచిపోయిన వస్తువులను తిరిగి అందజేసిన డ్రైవర్‌కు సీపీ సన్మానం

ఈ సందర్భంగా ఆటోల్లో మరిచిపోయిన ఖరీదైన వస్తువులను తిరిగి అందజేసిన ఆటోడ్రైవర్లను సీపీ సత్కరించారు. ఆటోడ్రైవర్లు రోడ్లపై ఏ విధంగా డ్రైవింగ్ చేయాలనే దానిపై ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌టీవో అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, షూకూర్, నాగబాబు, ఆర్‌టీవో అధికారులు రమేశ్ రాథోడ్, జైపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సైలు రామారావు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో 'పంచాయతీ' సందడి



స్థానిక ఎన్నికల్లో పోటీకి ఆశావహుల సై

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ సందడి ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో భాగంగా ఆగస్టు నెలలో పంచాయతీ పోరుకు నోటిఫికేషన్ ఇచ్చి ఆనెల చివరి వారంలో ఎన్నికలు నిర్వహించే దిశగా కసరత్తు జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పంచాయతీ ఎన్నికలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూత్రప్రాయంగా వెల్లడించారు. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలలు స్థానిక ఎన్నికలతో సందడిగా మారనున్నాయి. ఇక పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారంతా అవకాశం కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత కోసం ఎదురుచూస్తుండగా.. ఈ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఐదునెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న గ్రామ పంచాయతీలకు త్వరలోనే కొత్త సర్పంచులు కొలువు దీరనున్నారు.

- మద్దతుదారులతో మంతనాలు
- అవకాశం కల్పించాలంటూ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- రిజర్వేషన్లపై స్పష్టత కోసం ఎదురుచూపు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఓటర్ల జాబితా సవరణకు కసరత్తు

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలపై తాజా ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం వెల్లువెత్తుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. తమ మద్దతుదారులతో సమాలోచనలు చేయడంతోపాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ముఖ్యనేతలను ఆశ్రయిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన నాయకులు.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలనే లక్ష్యంతో ఉన్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రాకుంటే భార్యలను లేదంటే కుటుంబ సభ్యులను పోటీలోకి దించేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడి పని చేశామని, తమకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు.

రిజర్వేషన్లపై గుబులు

సర్పంచ్, వార్డు పదవులకు 2018లో ఎన్నికలు జరిగాయి. వారి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఓటర్ల జాబితా పూర్తయిన వెంటనే గడువులోగా బీసీ రిజర్వేషన్ల వివరాలు పంపించాలని బీసీ కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. ఇప్పుడున్న పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? అనే దానిపై నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా? ఏవైనా మార్పులు చేర్పులు చేస్తారా? అనే అంశంపై స్పష్టత రావలసి ఉంది. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే బీసీ గణన నిర్వహణకు సమయం లేదు. పం చాయతీల గడువు ముగిసిన ఆరు నెలల్లో ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. లేకుంటే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు ఆగిపోతాయి. బీసీ గణనను కనుక చేపడితే ఆ ప్రక్రియ పూర్తికావడానికి సమయం పడుతుంది. దీంతో ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనుక పాత విధానాన్నే కొనసాగించే వీలుంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

గతంలోనే ఏర్పాట్లు

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలకు గతంలోనే ఏర్పాట్లు జరిగాయి. గతేడాది డిసెంబరులోనే సర్పంచ్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీ ఎన్నికల్లో 200 మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల దృష్టి సారించారు.

పంచాయతీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,688 గ్రామ పంచాయతీలున్నాయి. హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ మొత్తం 1,688 పంచాయతీల్లో 83 మేజర్ గ్రామ పంచాయతీలు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పునర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకు ముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగాయి. హనుమకొండ జిల్లాలో పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.

ఓటర్ల జాబితా సవరణ

సర్పంచుల ఎన్నికలు నిర్వహించేందుకు మొదట ఓటరు జాబితా సవరణపై అధికారులు దృష్టి సారించనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోని ఓటర్ల జాబితాను గ్రామంలో వార్డుల వారీగా విభజిస్తారు. ఆ తర్వాత ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఆగస్టు మొదటి వారంలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై అధికారిక ఉత్తర్వులు త్వరలోనే రానున్నాయి.

బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉంటారు. అంతమందికి ప్రస్తుతం ఉన్న ఈవీఎంలు సరిపోవు. పైగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా పార్టీ గుర్తులు ఉండవు. అందుకనే పంచాయతీ ఎన్నికల్లో మొదటి నుంచి బ్యాలెట్



బాక్సులనే ఉపయోగిస్తున్నారు. ఈ దృష్ట్యా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి? ఇంకా అదనంగా ఎన్ని బాక్సులు అవసరమవుతాయి? ప్రస్తుతం ఉన్న బ్యాలెట్ బాక్సుల్లో సక్రమంగా ఉన్నవి ఎన్ని? వీటిలో మరమ్మతు చేయాల్సినవి ఎన్ని? తదితర వివరాలు పంపాల్సిందిగా ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను కోరారు. అలాగే పోలింగ్ సిబ్బందికి ఆర్‌వో బుక్‌లు ఏ మేరకు అవసరం అవుతాయో కూడా వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఆర్‌వో బుక్‌లు సైతం ఎక్కువ సంఖ్యలోనే అవసరమవుతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఆరు జిల్లాల డీపీవోలు గతంలోనే ఈ వివరాలను పంపినప్పటికీ తాజాగా మరో సారి తాజాగా సమాచారాన్ని సేకరించి పంపే పనిలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బ్యాలెట్ బాక్సులు సరిపడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అఖిల్ (ఫైల్)

శంభునిపేట, జూలై 30 : లారీ ఢీకొని యువకుడు మరణించిన ఘటన మామునూరులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. మామునూరు సీఐ రవికుమార్ కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం సింగారం గ్రామానికి చెందిన ఆకులపల్లి అఖిల్ (24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం స్నేహితులను కలిసేందుకు ఇంటి నుంచి వాగ్దేవి కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్లి, తిరిగి వస్తుండగా మామునూరు శివారులో వ రంగల్ నుంచి విశాఖపట్టణంకు మిర్చీ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. డ్రైవర్‌ను అదు పులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అయ్యో.. రామా..!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నలుగురిని కాపాడిన రిస్క్యూ టీమ్

5





సమావేశంలో జెండాను ఎగురవేస్తున్న చాడా వెంకట్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- 'ఇండియా' పాలిత రాష్ట్రాలపై వివక్ష
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

ఖిలావరంగల్, జూలై 30: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఇండియా కూటమిలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వివక్షకు పాల్పడిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం సీపీఐ ఖిలావరంగల్ మండల స్థాయి సమావేశం హంటర్‌రోడ్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఓర్సు రాజు అధ్యక్షతన రెండు రోజుల సీపీఐ శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ పాతపద్ధతినే అవలంబిస్తున్నారని ఆరోపించారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, అధిక నిధులు రాబట్టడంలో విఫలమైనందుకు కేంద్ర మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు రోజుకోకటి వెలుగులోకి వస్తున్నాయని, కాళేశ్వరం, మేడిగడ్డ నుంచి మొదలుకొని ధరణీ పోర్టల్, విద్యుత్ ప్లాంట్లతో పాటు ఇటీవల మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ రూ. 1400కోట్ల జీఎస్టీ కుంభకోణం వరకు బాధ్యులనూ విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, పనాస ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంచాల రమేష్, మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, సహా య కార్యదర్శి ఓర్సు రాజు, నాయకులు బుస్సా రవిందర్, గన్నారపు రమేష్, తోట చంద్రకళ, వీర గోని శంకరయ్య, సంగీ ఏలేందర్, దామెర కృష్ణ, తాళ్ళపల్లి జాన్‌పాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ళ శరత్ పాల్గొన్నారు.

రుణమాఫీ అందేలా చూడాలి

- రెండో విడత నిధులు మంజూరు
- జిల్లాలో 14,510 మంది రైతులకు లబ్ధి
- కలెక్టర్ సత్యశారద





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, కలెక్టరేట్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వరంగల్ కలెక్టరేట్, జూలై 30: రుణ మాఫీ ఫలాలు అర్హులైన రైతులందరికీ అందేలా చూడాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెండో విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు విడతలు కలిపి జిల్లాలో మొత్తం 36,561 మంది రైతులకు రూ.255.58కోట్ల రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొదటి విడత కింద లక్ష వరకు ఉన్న రుణమాఫీ 22,051 మంది రైతులకు సుమారు రూ.113కోట్ల మేర ఖాతాల్లో జమచేయడం జరిందన్నారు. రెండో విడతగా లక్షన్నర రుణమాఫీ కింద జిల్లాలో ఉన్న 14,510 మంది రైతులకు రూ.142.58కోట్ల ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వారం రోజుల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామన్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యూవల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల వరకు ప్రతి రైతు కుటుంబానికి మాఫీ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రుణమాఫీపై ఫిర్యాదుల పరిష్కా రానికి మండలాల్లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతాంగానికి పంటల బీమా, రైతుభరోసా అందిందిస్తామన్నారు. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస రావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, మండల ధికారులు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, బ్యాంకు మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

పది నిమిషాలు కరెంట్ కట్

కలెక్టరేట్‌లో సుమారు పది నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండో విడత రైతు రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో చేపట్టారు. కలెక్టర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, అధికారులు వేదిక పైకి చేరుకురు. కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు పది నిమిషాలు నిరీక్షించాల్సి వచ్చింది. జనరేటర్ సైతం మొరాయించడంతో సిబ్బంది మరమ్మతు చేసి ఆన్ చేయడం కొసమెరుపు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రెండో విడత రుణమాఫీ చేసిన సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ రవీందర్ మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలుబెట్టుకుందని తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- ఎన్నికల హామీని తుంగలో తొక్కిన కాంగ్రెస్
- బీజేపీ నాయకుడు ప్రదీప్‌రావు ధ్వజం
- ఖమ్మంరోడ్‌లో బీజేపీ ధర్నా, రాస్తారోకో



ఖమ్మంరోడ్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిలావరంగల్, జూలై 30: ఎన్నికల వేల కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఓబీసీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమళ్ల ఆనంద్‌గౌడ్ పిలుపు మేరకు వరంగల్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కందిమళ్ళ మహేష్ ఆధ్వర్యంలో ఖమ్మం రోడ్‌పై రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ హామీల ఊసేలేదన్నారు. మ హాత్మా జ్యోతిబాపూలే బీసీ సబ్‌ప్లాన్ నిధులు ఎక్కడ అన్నారు. ప్రభుత్వం వచ్చిన 100రోజుల్లో హామీలను నెరవేరుస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. బీసీ యువత చిరు వ్యాపారుల కోసం, విద్య కోసం రూ.10లక్షల వరకు రుణాలు ఎక్కడని ప్రశ్నించారు.

కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండేటి శ్రీధర్, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేపీ సీనియర్ స ముద్రాల పరమేశ్వర్, బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధం నరేష్, కనుకుంట్ల రంజిత్, ఎరుకల రఘునారెడ్డి, రత్నం కిషోర్ షా, బాకం హరిశంకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భైరి మురళీకృష్ణ, గోగికార్ అనిల్,ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు మార్టిన్‌లూథర్, మాదాసి రాజు, బీజేపీ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, వేల్పుల నందు, డివిజన్ అధ్యక్షులు మాదాసి రాజు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్

బీసీ డిక్లరేషన్‌పై ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పిలుపు మేరకు వరంగల్ ఖమ్మంరోడ్డుపై బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పోస్టర్‌లు పట్టుకొని అరగంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఖమ్మంరోడ్ గుండా ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చి తహ సీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ట్రాఫిక్ జాం కావడంతో మిల్స్‌కాలనీ పోలీసులు వాహనాలను దారి మళ్లించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, (మహబూబాబాద్ జిల్లా), జూలై 30 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా గంజాయి తరలిస్తున్నారు. డోర్నకల్‌లో 2021 జూలై 7న అప్పటి డోర్నకల్ ఎస్సై భద్రునాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండా అనుమానస్పదంగా వస్తున్న ఆ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రాలీకింద ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 150 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉండగా 150 ప్యాకెట్లలో 3 క్వింటాళ్ల గంజాయి ఉంది. సుమారు దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులైన కిరణ్‌కుమార్, సూర్యను అదుపులోకి తీసుకుని అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్ సాక్ష్యాన్ని ఆధారంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నిందితులైన బానోత్ కిరణ్‌కుమార్, బాదావత్ సూర్యకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తరిగొప్పుల పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కేసు వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు ఎన్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పందంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 1.565 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ అలియాస్ రమ్మీ, జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌ను విచారించగా భూక్య రమేష్ కరీంనగర్ నుంచి గంజాయి తీసుకువచ్చి జలీల్‌కు విక్రయిస్తుండగా జలీల్ తరిగొప్పుల చుట్టుప్రక్కల గ్రామాల యువకులకు ప్యాకెట్ల రూపంలో రూ. 100 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నాడని తేలింది. ఈ విషయమై వరంగల్ సీపీ అంబర్ కిషోర్, జనగామ డీసీసీ రాజమహేంద్ర నాయక్ ఎస్సై శ్వేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీసీ పార్థసారథి, నర్మెట సీఐ సాయిరమణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా తరిగొప్పుల పోలీసుస్టేషన్‌లో నిందితులను చూపుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఎలక్ట్రిక్ లోకో పీవోహెచ్‌పై ఆశలు

● ఎంపీలు చొరవ చూపి కాజీపేటలో నిర్మిస్తే 10 వేలమందికి ఉపాధి ● సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారుల పరిశీలన



కాజీపేట ఎలక్ట్రికల్ లోకోషెడ్

కాజీపేట, జూలై 30 : దక్షిణ భారత రైల్వేలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం కాజీపేటలోఉన్న ఎలక్ట్రికల్ లోకోషెడ్ దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో ఇంజన్‌ల నిర్వహణ, మరమ్మతులు చేసే ఒక మోటివ్ పవర్ డిపో.. దీనికి అనుసంధానంగా పీవోహెచ్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) కాజీపేటలోనే నిర్మాణం జరుగుతోంది. కాజీపేటలో నిర్మాణం జరిగితే ఇక్కడి రూపురేఖలు మారుతాయని రైల్వే ఉద్యోగాల సంఘాలు అంటున్నాయి.. ఈ పీవోహెచ్ కాజీపేటకు తీసుకు రాగలిగితే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి పెద్దగా ప్రయాసపడాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికే కాజీపేటలో వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ వ్యాగన్ ఓవరాలింగ్ పరిశ్రమ నిర్మాణపనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్‌లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రికల్ పీవోహెచ్ నిర్మిస్తే కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడుతూ పాత శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ పీవోహెచ్ నిర్మిస్తే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. కాజీపేటకు ప్రాధాన్యం పెరుగుతుంది. సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారులు ఇక్కడికి వచ్చి ఈ మధ్యనే పరిశీలించారు. స్థలం, రైల్వే స్టాఫ్ పొజిషన్, నీటి సౌకర్యం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకూల అంశాలుగా ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటే..

ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ అంటే (పీవోహెచ్) ఎలక్ట్రిక్ లోకోలను ఒక్కొక్క భాగాలను విడదీసి ఓవరాలింగ్ చేసి కొత్త లోకో ఇంజన్ తయారు చేసే ప్రక్రియ. లోకోషెడ్‌లో మరమ్మతు చేసిన లోకో ఇంజన్‌లు ఇచ్చిన షెడ్యూల్ ట్రిప్పులు పూర్తయిన తర్వాత లోకోల మోడల్‌ను బట్టి 5,10,15 ఏళ్లకోసారి ఓవరాలింగ్ కోసం పీవోహెచ్ షెడ్‌కు రావల్సిందే. ఈ తతంగమంతా చేసే దానినే ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటారు. ఇలా పీవోహెచ్‌కు వచ్చిన లోకోల మెయింటనెన్స్, ఇన్‌స్పెక్షన్ చేయకముందే బయటకు పంపడం కుదరదు. ఒక విధంగా చెప్పాలంటే లోకోలను పరిశీలించి ఒక్కొక్కభాగాన్ని విడదీసి పనికొచ్చే భాగాలతో కొత్త లోకో తయారు చేయడమన్న మాట. అలాంటి ఎలక్ట్రికల్ పీవోహెచ్‌ను కాజీపేటలో నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాజీపేటలోనే నిర్మించడానికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ ప్రారంభమైంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఉండటం, ఇక్కడే ప్రస్తుతం దాదాపు 200 లోకోలకు మరమ్మతులు చేయడం, కావాల్సినంత స్థలం, నీరు, రవాణా అనుకూలంగా ఉండటమే ప్రధాన అంశం. పైగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌కు మంచి రైల్, రోడ్ కనెక్టివిటీ ఉండడమే కూడా ప్రధానం అంశంగా చెప్పొచ్చు. కాచిగూడ, కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ షెడ్, గుత్తి, గుంతకల్ విజయవాడలో ఉన్న లోకోషెడ్‌లలో మొత్తంగా 1,195 లోకోలు ఉన్నాయి. ఇక్కడ మరమ్మతులు అయిన లోకోలను పీవోహెచ్‌కు తరలించడానికి పంజాబ్‌లోని కపుర్తాలకు, చెన్నైలోని పెరంబదూర్ తరలించి ఓవరాలింగ్ చేయాల్సి వస్తుంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జోన్‌లో 800 లోకోలు ఉంటేనే పీవోహెచ్ నిర్మాంచాలని ఆదేశాలు ఉన్నాయి. మన జోన్‌లో 1,195 లోకోలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాలతో పీవోహెచ్ కాజీపేటలో కనుక నిర్మిస్తే లోకోలను తరలించే వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా రైల్వేకు మంచి లాభం. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో జిల్లా ఎంపీలు పట్టుపడితే కచ్చితంగా కాజీపేటకు వస్తుందని రైల్వేకార్మిక సంఘాలు, ఉద్యోగులు అంటున్నారు. ఎంపీలు చొరవచూపి ఇక్కడే నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన



డాక్టర్ బి.కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన ఆయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు



డాక్టర్ రమేశ్

వరంగల్ మెడికల్, జూలై 30: న్యూరో సైన్స్ అల్జీమర్స్ వ్యాధులపై పరిశోధనలు జరిపిన వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన నాసా సైంటిస్ట్ అవార్డు ప్రదానం చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ రమేశ్ గతంలో కేఎంసీలో కూడా పనిచేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి పదేళ్ల అక్కడి మెమోరీ యూనివర్సిటీలో హెల్త్ సైన్సెస్ విభాగంలో అనేక పరిశోధనలు చేశారు. న్యూరో సైన్స్ విభాగంతోపాటు అల్జీమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనలకు గాను ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ఈ వ్యాధులపై పరిశోధన చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల్లో ఇద్దరు ఉండగా, భారతదేశం నుంచి డాక్టర్ రమేశ్ ఆస్థానాన్ని దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట అమెరికా నాసా సైంటిస్ట్ అవార్డును రమేశ్‌కు ప్రకటించింది.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

మడికొండ వద్ద ఘటన.. విద్యార్థులకు స్వల్పగాయాలు



లారీ ఢీకొని ధ్వంసమైన స్కూల్ బస్సు

మడికొండ, జూలై 30: స్కూల్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సక్సెస్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళుతోంది. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన లారీ వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో వాల్మీకినగర్ వద్దకు రాగానే స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొని, ఎదురుగావస్తున్న కారును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం ధ్వంసమై అద్దం పగిలిపోయింది. దీంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కొద్ది తేడాతో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు.. లారీలు గ్రామంలోకి రావొద్దని ఎన్నిసా ర్లు ఆందోళన చేసినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. లారీల లారీలను గ్రామంలోకి రానివ్వద్దని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బురద మడిలో కుప్పకూలి రైతు మృతి

ఐనవోలు, జూలై 30: బురదమడిలో కుప్పకూలి రైతు మృతిచెందిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. డోబీల సంపత్(54) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రెండు, మూడు రోజుల్లో పొలంలో నాటువేయాల్సి ఉండగా బురదమళ్లలో నీటిని పరిశీలిస్తూ గట్టుపై నుంచి నడుచుకుంటు వెళ్తూ బురదమడిలో బోర్లపడిపోయాడు. కొద్ది దూరంలో ఉన్న రైతులు అటుగా వచ్చి చూసేవరకు బురదమడిలో తల కూరుకుపోయి ఉన్నాడు. వారువచ్చి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కాగా, సంపత్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల

వరంగల్ మెడికల్, జూలై 30: వైద్య, ఆరోగ్యశాఖ నాలుగో జోన్ పరిధిలోని నర్సింగ్ ఆఫీసర్స్ బదిలీ ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. సీనియారిటీ జాబితాలో తప్పుల తడకలు, యూనియన్ ఆఫీస్ బేరర్స్ లేఖలు, ధర్నాలు, రాస్తారోకోలు, కౌన్సెలింగ్ సమయంలో జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు ఎంజీఎంకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ వెళ్లడంతో నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సేవలు అందించారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొనడంతో నాలుగో జోన్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు అందరూ కొత్త పోస్టింగ్ బాట పట్టారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోటు కాకుండా మరో చోటు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, 78మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు స్థానచలనం కల్పించారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు 23 మంది ఎంపిక

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీలో 23 మందిని నెల రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ సెంటర్ నేతృత్వంలో నాలుగు వారాల పాటు 23 మందికి బిల్డింగ్ కెపాసిటీ, ఇంగ్లీష్ గ్రామర్, కంప్యూటర్ స్కిల్స్, ఆఫీస్ ప్రొసీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరిలో క్లర్క్స్ కం టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు తరగతులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఖాతా నుంచి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సెల్ఫ్ కార్యాలయానికి చెల్లించాలని వివరించారు. కేయూ పీఆర్వో, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను సమన్వయకుడిగా నియమించారు.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు

వరంగల్ చౌరస్తా, జూలై 30: ఆదాయ పన్ను రిటర్న్స్‌కు బుధవారం ఆఖరి గడువని అధికారులు పేర్కొంటున్నారు. గడువులోపు ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రూ.5వేల పెనాల్టీతో డిసెంబరు 31 వరకు దాఖలు, రూ.వెయ్యి పెనాల్టీతో డిసెంబరు 31 వరకు చేసుకునే అవకాశాన్ని ఆదాయపు పన్ను శాఖ అవకాశమిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఏటా ఆదాయ పన్ను శాఖకు వ్యాపార, వాణిజ్య, ఉత్పత్తి సంస్థలకు చెందిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లించే వారు 87వేల మంది ఉన్నారు. వీరు ప్రతీ ఏటా తమ ఆదాయాన్ని బట్టి తమ ఏడాది లాభ నష్టాలతో కూడిన వివరాల పత్రాలను ఆదాయపన్ను శాఖకు సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1,500 మంది డిఫాల్టర్లు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని సమాచారం. ఆదాయపన్ను శాఖ ప్రతీ ఏటా పన్ను చెల్లింపు ఐటీ రిటర్న్ దాఖలులో 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. వీరికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఉద్యోగులకు, చిన్న తరహా వ్యాపారులకు రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉన్న వారికి 5శాతం పన్ను, రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు 10శాతం, రూ.9లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షల ఆదాయం దాటిన ప్రతీ ఒక్కరు తమ ఆదాయంలో 30శాతాన్ని పన్నును ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు : మహేందర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కొందరు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు దాఖలు పత్రాల్లో తప్పుడు సమాచారంతో మినహాయింపులు డిడెక్షన్లు చూపిస్తున్నారు. రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్‌ను పొందుతున్న విషయం ఆదాయపన్ను శాఖ విభాగం దర్యాప్తులో తేలింది. తప్పుడు రిటర్న్ దాఖలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధం

ఆర్జేడీకి ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధంగా ఉన్నాయని ఖమ్మం డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.గాయత్రిదేవి ఆరోపించారు. ఆఫీస్ బేరర్ల అసంబద్ధ లేఖలతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె మంగళవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు వెలువరిచిన తర్వాత యూనియన్ ఆఫీస్ బేరర్‌గా జారీ చేసిన లేఖలు లెక్కా పత్రం లేకుండా ఉన్నాయని విమర్శించారు. లేఖలను అభ్యర్థుల పేరున వ్యక్తిగతంగా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బదిలీల నిబంధనల మేరకు 40 శాతంలో తాను రానప్పటికీ అక్రమ మార్గంలో నలుగురు సహోద్యోగులు టీఎన్‌జీవోస్ ఆఫీస్ బేరర్లుగా లేఖలు సమర్పించడంతో తాను హనుమకొండ నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు యూనియన్ ఆఫీస్ బేరర్లు అయినప్పటికీ స్టేషన్ సీనియారిటీలో ఆరేళ్లుంటే వారిని తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని ఉన్నప్పటికీ అధికారులు ఆ నిబంధనను విస్మరించారని ఆరోపించారు. ఇలాంటి పొరపాట్లే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో జరిగితే ఆఫీస్ బేరర్ల లేఖలు సమర్పించిన వారిని నిబంధనల మేరకు బదిలీలు చేశారన్నారు. ఉద్యోగుల బదిలీల నిబంధనలు డిపార్ట్‌మెంట్‌కు ఒక విధంగా ఉంటాయా? అని ఆమె ప్రశ్నించారు. అసంబద్ధంగా, అక్రమ మార్గంలో ఆఫీస్ బేరర్ల లేఖలను తీసుకురావడంతోనే బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె ఆరోపించారు. వైద్యశాఖలో అధికారులు చేపట్టిన చర్యల్లాగా విద్యాశాఖలోనే అలాంటి చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంది. తాను ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో పాటు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానన్నారు.

అయ్యో.. రామా!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్



అయోధ్యకు వెళ్లే ముందు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఫొటో దిగిన నాగరాజు కుటుంబసభ్యులు, గల్లంతైన తేజశ్రీ (ఇన్‌సెట్లో)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి దర్శనానికని సంతోషంగా వెళ్లిన ఆ కుటుంబానికి దేవుడు తీరని శోకాన్ని మిగిల్చాడు. నీటి ప్రవాహం రూపంలో వచ్చిన మృత్యువు కళ్ల ముందే కూతురును బలితీసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నదీస్నానం చేస్తున్న యువతిని సరయూ నది మింగేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య లక్ష్మణ కిలా ఘాట్ వద్ద జరిగింది. లక్ష్మణ ఘాట్‌లో స్నానం చేస్తున్న జనగామకు చెందిన యువతి సరయూ నదిలో గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు ఉపాధి కోసం జనగామలోని సిద్దిపేట రోడ్డులో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులందరితో అయోధ్య, కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. తన భార్య జయసుధ, కూతుళ్ల తేజశ్రీ, తరుణితో పాటు సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లారు. ఆదివారం రాత్రి విమానంలో హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అయోధ్య బాలరాముడి దివ్య దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత కాశీకి వెళ్లేముందు అయోధ్యలోని సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్‌లో నదీస్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఘాట్‌లో స్నానం చేస్తున్న ఐదుగురు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్ స్పందించి నలుగురిని కాపాడింది. నీటిప్రవాహం మరింతగా పెరగడంతో నాగరాజు పెద్దకూతురు తేజశ్రీ(17) నీటిలో కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరగగా మంగళవారం రాత్రి వరకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. సరయూ నదిపై ఉన్న డ్యామ్ గేట్లు ఎత్తడం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కాగా.. తేజశ్రీ జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కన్నీరుమున్నీరుగా..

కళ్లముందే కూతురు గల్లంతు కావడంతో ఆ తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఊరు కాని ఊరులో తమ బిడ్డ ఆచూకీ లభ్యం కావాలని, ప్రాణాలతో బయట పడాలని ఆ అయోధ్య రాముడిని తలచుకుంటూ ఆ కుటుంబ సభ్యులు సరయూ నది ఒడ్డునే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అప్పటిదాకా అందరితో సంతోషంగా, నవ్వుతూ గడిపిన కూతురు గల్లంతు కావడం ఆ తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

యూపీ అధికారులకు బండి సంజయ్ లేఖ

యువతి గల్లంతు విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. యూపీ అధికారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. యువతి ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ అయోధ్య కలెక్టర్ చంద్ర విజయ్‌సింగ్, అయోధ్య ఎస్పీ రాజ్ కరణ్ నాయర్, యూపీ ముఖ్యమంత్రి ఓఎస్డీకి సూచించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

వికలాంగులకు ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలి

వడ్డెపల్లి, జూలై 30: వికలాంగులందరికీ జీవోనంబర్ 56 ప్రకారం ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలని దివ్యాంగుల సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండిస్వరూప, రాష్ట్ర సలహాదారుడు సమ్మెట వేణుగోపాల్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన విధంగానే దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. బ్యాంకులతో నిమిత్తం లేకుండా రూ.10లక్షల రుణాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు రాజ య్య, మహాలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా

బాలసముద్రం, జూలై 30: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలను వరంగల్ 1డిపోలో ముగింపు వేడుకలను వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పాల్గొని ఆర్టీసీ రీజినల్ పరిధిలో 9 డిపోల నుండి ఆర్టీసీ విధులలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇతర సిబ్బందిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బస్సు నడుపుతున్నప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఆర్ఎం డి.బిజయభాను మాట్లాడుతూ.. అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న డ్రైవర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, మాధవరావు, రీజియన్‌లోని 9 డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు హాజరైన పెన్షనర్లు



వరంగల్ వ్యవసాయం, జూలై 30: హైదరాబాద్‌లో పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో పెండింగ్ డిమాండ్స్ కోసం తలపెట్టిన మౌనదీక్షలో ఉమ్మడి వరంగల్ జిల్లా పెన్షనర్స్ పాల్గొన్నారు. ఇందులో మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగపురి సారయ్య ఆధ్వర్యంలో పెన్షనర్స్ దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహ అధ్యక్షుడు కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి సత్యనాథ్, వెంకటేశ్వర్లు, జగన్మోహన్, సజ్జద్ అలీ, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, రాజేశ్వర్, రాంకిషన్, సారంగపాణి, మారయ్య, కొంరయ్య పాల్గొన్నారు.



తీగరాజుపల్లి ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న బృందం

గ్రామాలను సందర్శించిన అధికారుల బృందం

సంగెం, జూలై 30: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, ప్రజల సద్వినియోగంపై అధికారుల బృందం తీగరాజపల్లిలో పర్యవేక్షించారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సర్వీసుకు ఎంపికైన అధికారులు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ద్వారా శిక్షణ పొందుతున్న ఐదుగురు బృందం గ్రామంలో కేంద్రం అందించిన నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మొక్కల పెంపకం, వైకుంఠ ధామం, ఇంకుడు గుంతలు, సైడ్ కాల్వల నిర్మాణం, డంపింగ్ యార్డ్, రేషన్ షాపును సందర్శించి నిధుల సద్వినియోగంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రేషన్‌షాపు ద్వారా పేదలకు అందుతున్న ఉచిత బియ్యం ప్రజలు ఉపయోగిస్తున్న విషయంను కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంగెం ఎంపీడీవో కాసర్ల రవీందర్, మాజీ సర్పంచ్ రమగోపాల్, మాజీ ఎంపీటీసీ రంగరాజు నర్సింహస్వామి పాల్గొన్నారు.

మరియపురం, గంగదేవిపల్లిలో..

గీసుగొండ: జాతీయ ఆదర్శ గ్రామాలైన మరియపురం, గందేవిపల్లి గ్రామాల్లో గల వ్యవసాయ క్షేత్రాలను కేంద్ర సచివాలయ గ్రూప్-1 అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించేందుకు వచ్చిన బృందం ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను, పట్టుపురుగుల, పండ్లతోటల పెంపకం తీరును పరిశీలించారు. అధిక దిగుబడులకు అనుసరిస్తున్న పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు, రూఫ్‌హార్వెస్టింగ్, బోర్ రాచార్జీపిట్‌లు, వైకుంఠధామాలు, నర్సరీ, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, టీం సభ్యులు విక్రాంత్ పునీయ,అమిత్‌కుమార్‌బార్రి, ప్రదీప్‌గుర్జర్, అమిత్‌కుమార్, సత్యంసింగ్‌పాల్, ఆశ్రాఫ్, అంకిత్‌సింగ్, రోనాక్‌త్యాగి, ప్రత్యూషతివారి, అమన్‌జంగ్ర, డీటీఎం కూసం రాజమౌళి, ఏవోలు హరిప్రసాద్‌బాబు, అరవింద్, ఏఈవో రజిని, ఎన్‌ఐఆర్డీ ప్రతినిధి శేఖర్, ఏపీఎం చంద్రకాంత్ పాల్గొన్నారు.

బల్దియా ఎదుట కార్మికుల ధర్నా



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూతోపాటు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు అందించారు. కార్మికులకు రెయిన్ కోట్స్, పారుల, చీపుర్లు, ఆప్రాన్స్ సకాలంలో అందించాలని వినతి పత్రంలో వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాలేజీకి భవనం నిర్మించాలి

హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని ప్రభుత్వ కాలేజీకి కొత్త భవనం నిర్మించాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీ ఎస్‌ఓ) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర సెకటేరియట్ సభ్యులు వినోద్, నాగరాజు, అభిషేక్, వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు హరితేజ మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాబోర్డు కార్యదర్శి పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భవన నిర్మాణం కోసం రూ.25కోట్లను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 30: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖతోపాటు మునిసిపల్, పంచాయతీ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలిజేయాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించిస్తూ ఇళ్లు, సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి నిల్వ ఉన్న నీటిని బయట పారబోసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి గ్రామాల్లో రోజువారీగా నిర్వహించే పనులను విధిగా చేయించాలని తెలిపారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యంపై ప్రతి రోజు నివేదికలు పంపించాలని డీపీవోకు సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలపై చైతన్యం కల్పించాలని డీఆర్‌డీవోను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈవో వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, గిరిజన సంక్షేమ, మైనారిటీ శాఖ అధికారి సౌజన్య, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు పుష్ప, భాగ్యలక్ష్మీ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నేతలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే బీసీ డిక్లరేషన్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హామీ ఇచ్చి ఎనమిది నెలలుగా గడుస్తున్నా బీసీ డిక్లరేషన్ ఊసెత్తకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు గండమళ్ల ఆనంద్‌గౌడ్ పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలపై నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, పరమేశ్వర్, సిద్ధం నరేశ్, రఘునారెడ్డి, బాకం హరిశంకర్, మురళీకృష్ణ, మార్టిన్ లూథర్, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కమాండెంట్



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న కమాండెంట్ రామ్ ప్రకాశ్

శంభునిపేట : మామునూరులోని టీజీఎస్పీ 4వ బెటాలియన్ కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్ మంగళవారం కలెక్టర్ సత్యశారదను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 4వ బెటాలియన్‌కు పూర్తి స్థాయి కమాండెంట్‌గా రామ్ ప్రకాశ్ ఇటీవల బదిలీపై వచ్చారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందించారు.

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ అభివృద్ధి: సీపీఎం

కరీమాబాద్, జూలై 30: ప్రజా ఉద్యమాలతోనే పార్టీ అభివృద్ధి చెందుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. మంగళవారం ఉర్సు గుట్ట పార్టీ జిల్లా కార్యాలయంలో సింగారపు బాబు అధ్యక్షతన జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జి.నాగయ్య హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసి, పేద ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నారు. కార్మిక చట్టాలు కుదించి, కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్‌ఐసీ, రైల్వే, విమానాశ్రయం, ఓడరేవులు మొత్తం ప్రైవేటు పరం చేస్తోందని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 400 సీట్లు వస్తాయని మాటలు చెప్పి, మిత్రపక్షాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్యం వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించిందని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య సమ్మయ్య, నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, కోరబోయిన కుమారస్వామి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగయ్య



సమావేశంలో పాల్గొన్న కమాండెంట్, అధికారులు

తప్పుడు ఐటీ రిటర్న్ దాఖలు చేస్తే చర్యలు తప్పవు..: కమాండెంట్

శంభునిపేట, జూలై 30: ఐటీ రిటర్న్స్ దాఖలు చేసే పోలీసు అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తే చర్యలు తప్పవని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్ అన్నారు. మామునూరులోని ఫోర్త్ బెటాలియన్‌లో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు సిబ్బందితో కలిసి మంగళవారం కమాండెంట్ ఉద్యోగులకు ఐటీ రిటర్న్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. రామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. కొంతమంది ఉద్యోగులు ఆదాయపన్నును తప్పించుకునేందుకు తప్పుడు మినహాయింపులను చూపిస్తూ రావాల్సిన దాని కన్నా అధిక మొత్తంలో రీఫండ్స్ క్లెయిమ్ చేసిన సంఘటనలు ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తుల్లో తేలిందన్నారు. పన్ను ఎగవేతకు పాల్పడినా, తప్పుడు లెక్కలు సమర్పించినా తగిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆదాయపు పన్ను శాఖ రేంజ్ 3 కమిషనర్ ఐఆర్‌ఎస్ అధికారి తేజావత్ వెంకన్న, బెటాలియన్ ఆదాయపు పన్ను విభాగం అధికారి సి.మహేందర్ బాబులు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

బాధితులకు చేయూత

గీసుగొండ, జూలై 30: మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల స్నేహలత అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా గ్రామ యువసేన సభ్యులు మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం, 50కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్ర మంలో ప్రవీణ్, కుమారస్వామి, శరత్, అశోక్, సాయి కృష్ణ, జ్ఞానతేజ, సునీల్, నరేష్, ప్రశాంత్, శేఖర్, రాకేష్, పవన్ పాల్గొన్నారు.

గరీభ్‌నగర్‌లో పౌరహక్కుల దినోత్సవం

గీసుగొండ, జూలై 30: గరీభ్‌నగర్‌కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ రియాజుద్దిన్ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు సీసీ రోడ్లు, డ్రైనేజి, లైటింగ్ సమస్యలు ఉన్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు చిన స్వామి, సంజీవ్, సారయ్య, రమేష్ పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు ఎప్పటికప్పుడు చెల్లించాలి



కూరగాయల వ్యాపారులతో సమావేశమైన కార్యదర్శి నిర్మల

వరంగల్ వ్యవసాయం, జూలై 30: మార్కెట్ ఫీజుతోపాటు దుకాణాల అద్దెలను ఎప్పటికప్పుడు చెల్లించాలని ఏనుమాముల మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అన్నారు. మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కూరగాయల మార్కెట్ వ్యాపారులతో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల సమావేశమయ్యారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ... గేట్ ఎంట్రీ, తక్ పట్టీల నిర్వాహణ, మార్కెట్ ఫీజు చెల్లింపులు తప్పకుండా చేయాలన్నారు. షాపుల అద్దెలు పెంచడం అన్నది రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే సిస్టం ఉంటుందని, ప్రతీ సంవత్సరం ఐదుశాతం పెరుగుతుందన్నారు. టమాట దిగుమతి కోసం ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరగా కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. అనంతరం కొత్తమీర అమ్మకందారులు కార్యదర్శిని కలిసి తమకు మార్కెట్లోనే కమర్షియల్ షట్టర్స్‌లో అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, సోమిశెట్టి ప్రవీణ్, వ్యాపారులు బురుగు శ్రీను, బాబా, సర్వర్, మున్నా పాల్గొన్నారు

క్రైం న్యూస్

డ్రంకెన్ డ్రైవ్‌తో జరిమానా

మట్టెవాడ, జూలై 30: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 29 మంది వాహనదారులకు మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహన నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 29 మంది వాహనదారులకు రూ.45,800 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురికి రూ. 7,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

రౌడీషీట్ నమోదు : ఏసీపీ

మట్టెవాడ, జూలై 30: శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని వరంగల్ ఏసీపీ నంది రాంనాయక్ హెచ్చరించారు. మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలోని రామన్నపేట, రఘునాథ్‌కాలనీ ప్రాంతానికి చెందిన పానుగంటి సురేశ్‌పై మంగళవారం రౌడీషీట్ తెరిచినట్లు ఏసీపీ తెలిపారు. సురేశ్‌పై 2013 నుంచి 2023వరకు పలు కేసులు నమోదయ్యాయన్నారు. అమాయక ప్రజలపై భౌతికదాడులకు పాల్పడటం, బెదిరించడం, బూతులు తిట్టడం, కొట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, హత్యాహత్నం తదితర కేసులు సురేశ్‌పై నమోదైనట్లు తెలిపారు. దీంతో సురేష్‌పై రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, జూలై 30: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం. రామన్నపేటకు చెందిన పిట్టల కార్తీక్ పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం రాత్రి రామన్నపేటలోని కుంటి భద్రయ్య టెంపుల్ నుంచి పోతన రోడ్‌లోని లేక్ వ్యూ బార్ వైపు కార్తీక్ వస్తుండటంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు కార్తీక్‌ను తనిఖీ చేయగా అతని వద్ద నుంచి ఐదు కిలోల గంజాయి దొరికింది. గంజాయి స్వాధీన చేసుకుని కేసు నమోదు చేశారు.

కోటి మల్లెలతో అలంకరణ



గీసుగొండ, జూలై 30: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడిని కోటి మల్లెపూలతో అలంకరించి మంగళవారం పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలోతరలివచ్చి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. వైద్యులు శివసుబ్రహ్మణ్యం, మట్టెవాడ సీఐ గోపిస్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, బాబురావు, రాజేందర్ పాల్గొన్నారు.

బల్దియాలో పలువురు అధికారులకు పోస్టింగులు

నర్సంపేట మునిసిపల్ కమిషనర్ బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పనిచేసేందుకు పోస్టింగులు కల్పిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియా నుంచి ఇటీవల కొందరు అధికారులు ఉద్యోగ విరమణ పొందగా, మరికొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నలుగురు అధికారులకు పోస్టింగులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌లు పొందిన వారిలో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రాజేందర్‌రెడ్డి బల్దియాకు అడిషనల్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్నారు. అలాగే సిద్ధిపేట మునిసిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ -1 మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.ప్రసన్నరాణి గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ పొందారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ అధికారిగా పని చేస్తున్న ఎ.విజయలక్ష్మి వరంగల్ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నర్సంపేట మున్సిపాలిటీ గ్రేడ్-2 కమిషనర్‌గా పని చేస్తున్న బి.శ్రీనివాస్‌ను గ్రేటర్ వరంగల్ టాక్సేషన్ అధికారిగా బదిలీ చేశారు. శ్రీనివాస్ స్థానంలో హైదరాబాద్ పీడీఎంఏలో వేయిటింగ్ లిస్టులో ఉన్న నర్సంహారెడ్డి రానున్నారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

నర్సంపేట టౌన్, జూలై 30 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నర్సంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. నర్సంపేట మండలం మహేశ్వరానికి చెందిన నాగమల్ల స్వాతి(35)-రమేష్ దంపతులు గత కొన్నేళ్లుగా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేట రోడ్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. రమేష్ పట్టణంలో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత కరోనా సమయంలో రమేష్ వ్యాపారం రూ.20లక్షల వరకు నష్టపోవడం జరిగింది. నాటి నుంచి ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో స్వాతి మనోవేదనకు గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్లో అంతర్గత బదిలీలు

వరంగల్ వ్యవసాయం, జూలై 30: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీలో మంగళవారం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల సిబ్బంది అంతర్గత బదిలీలు చేశారు. సహాయ కార్యదర్శి జి.రాజేందర్‌కు అదనంగా లైసెన్స్ సెక్షన్ కేటాయించారు. సూపర్‌వైజర్ శ్రీకాంత్‌కు అసెస్‌మెంట్ సెక్షన్ (ఏటుఎం)లో సహాయక విధులు అప్పగించారు. ఖరీదుదారుల వివరాలు చూడడం, నెలవారి పర్చేజింగ్, రిటర్న్స్ వసూలు, మార్కెట్ ఫీజు వసూలు ఏ రోజుకారోజు ట్రెజరిలో జమ చేయాల్సి ఉంటుంది. ఎక్స్‌పోర్టు పర్మిట్(ఈపీ) బుక్‌లు అమ్ముట, రోజువారి ఎగుమతి బుక్కులు అమ్మిన నగదును అకౌంట్ సెక్షన్ నందు సమర్పించే పనులను అప్పగించారు. యూడీసీ వినయ్‌కాంత్‌కు (ఎన్ టు జడ్) సహాయకులుగా విధులు అప్పగించారు. అలాగే ఖరీదుదారుల వివరాలు చూడడం, నెలవారి పర్చేజింగ్, రిటర్న్స్ వసూలు, మార్కెట్ ఫీజు వసూలు ఏ రోజుకారోజు ట్రెజరీలో జమ చేయాలి. ఎక్స్‌పోర్టు పర్మిట్(ఈపీ) బుక్‌లు అమ్ముట, రోజువారి ఎగుమతి బుక్కులు అమ్మిన నగదును అకౌంట్ సెక్షన్ నందు సమర్పించే పనులను అప్పగించారు. పి.లక్ష్మీనారాయణకు అదనంగా కోల్డ్‌స్టోరేజీల నిర్వహణ, కోల్డ్ స్టోరేజీలలో రైతుల సరుకు వివరాలు సంబంధిత రిజిస్టర్లలో నమోదు బాధ్యతలు అప్పగించారు. పర్యవేక్షకులు నర్సింగరావుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న పత్తి యార్డుతోపాటు బీటు బజారు, రైస్ మిల్లులు, లైసెన్సు లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయడం లాంటి పనులు అప్పగించారు. పర్యవేక్షకులు మురళీయాదవ్‌కు ప్రస్తుత నిర్వహిస్తున్న (జెటుఆర్) వరకు నిర్వహిస్తున్న విధులను ఉపసంహరిస్తూ లక్ష్మీపురం మోడల్ వేజిటేబుల్ మార్కెట్ ఇన్‌చార్జిగా విధులు కేటాయించారు.

పర్యవేక్షకులు ఎండి సలీం, చక్రబహదూర్‌కు మార్కెట్ యార్డులో వచ్చే సరుకులను గేట్ ఎంట్రీ చేయడం, బిడ్డింగ్ రిజిస్టర్ నిర్వహణ, తక్‌పట్టీ నమోదు, మార్కెట్ ఫీజు, అద్దె, కమర్షియల్ షాపుల కిరాయిలు సకాలంలో వసూలు రిజిస్టర్‌లో నమోదు, నిధులను మార్కెట్ ఖాతాలో జమ చేయడం, మార్కెట్ క్లీనింగ్ పనులు పర్యవేక్షణ అప్పగించారు. ఏఎంఎస్ వివేక్‌కు అదనంగా దడువాయిలకు పీవోఎస్ మిషన్లను కేటాయించారు. జేఎంఎస్ రజితకు పర్యవేక్షకులు శ్రీకాంత్, యూడీసీ వినయ్‌కాంత్‌లకు అసెస్‌మెంట్ సెక్షన్‌లో సహాయకురాలిగా విధులు నిర్వహించాలని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మల ఉత్తర్వులు జారీ చేశారు.



కల్లెడలో పౌరహక్కుల దినోత్సవం

పర్వతగిరి, జూలై 30: మండలంలోని కల్లెడ గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎవరైనా పౌరహక్కులకు భంగం కలిగించకూడదని, భంగం కలిగించినట్లయితే చట్టపరంగా ఎదుర్కోవచ్చున్నారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై రవీందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కస్నానాయక్, ఎసీహాస్టల్ వార్డెన్ కంజర్ల రవికుమార్, కార్యదర్శి మాధవుడు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

మత్తడికి చేరువలో పాకాల సరస్సు


నిండు కుండలా కనిపిస్తున్న పాకాల చెరువు

ఖానాపురం, జూలై 30: జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు నీటిమట్టం మత్తడికి చేరువలోకి చేరుకోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. 30.2 అడుగుల పూర్తి సామర్థ్యం గల పాకాల సరస్సు మంగళవారం నాటికి 27.3 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. సోమవారం రాత్రి భారీ వర్షం కురియడంతో పాకాల ఎగువ ప్రాంతం నుండి వాగుల నుండి వరదనీరు ఉధృతంగా రావడంతో పాకాల సరస్సులో నీటిమట్టం పెరిగి జలకళతో నిండుకుండను తలపిస్తోంది. మరో 3అడుగుల నీరు చేరితే పాకాల సరస్సు మత్తడి పోయనుంది. పాకాల సరస్సు మత్తడిపోస్తే రెండు పంటలకు ఢోకాలేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

అధ్వానంగా రహదారులు

- పట్టించుకోని అధికారులు, పాలకులు

నల్లబెల్లి, జూలై 30: మండలంలోని పలు గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ప్రధానంగా ఆసరవెల్లి నుంచి మురళీనగర్ వెళ్లే రోడ్లు తీవ్ర బురద మయంగా మారాయి. ఈ రోడ్ల గుండా ప్రయాణించాలంటే రైతులు, కూలీలు, బాటసారులు నరకయాతనగా ఉందని జంకుతున్నారు. అలాగే గొల్లపల్లి ప్రధాన కూడలి రోడ్డు నుంచి పంట చేలకు వెళ్లాలంటే రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆరోపి స్తున్నారు. మేడపల్లి రోడ్డు కూడా బురదమయంగా మారిందన్నారు. అంతేగాక రుద్రగూడెం గ్రామంలో బొడ్రాంఐ నుంచి చిన్న తండాకు వెళ్లే రోడ్డు ఇబ్బందిగా ఉందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావునా రోడ్ల స్థితి గతులను గుర్తించి మండంలంలోని రోడ్లను బాగు చేయాలని అధికారులను, పాలకులను ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా మారిన మురళీనగర్ రోడ్డు


చిత్తడిగా మారిన గొల్లపల్లి రోడ్డు

నర్సంపేట మునిసిపల్ కమిషనర్ బదిలీ

కొత్త కమిషనర్‌గా నర్సింహారెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: గ్రేడ్-1, గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్‌ల బదిలీలు మంగళవారం రాత్రి చేపట్టారు. ఈమేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట మున్సి పాలిటీ గ్రేడ్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌ను గ్రేటర్ వరంగల్ టాక్సేషన్ అధికారిగా బదిలీ చేశారు. శ్రీనివాస్ స్థానంలో హైదరాబాద్ పీడీ ఎంఏలో వేయిటింగ్ లిస్టులో ఉన్న నర్సింహారెడ్డి రానున్నారు. అలాగే, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పనిచేసేందుకు పోస్టింగులు కల్పిస్తూ బల్ది యా నుంచి ఇటీవల కొందరు అధికారులు ఉద్యోగ విరమణ పొందగా, మరి కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నలుగురు అధికారులకు పోస్టింగులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌లు పొందిన వారిలో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రాజేందర్‌రెడ్డి బల్దియాకు అడిషనల్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్నారు. అదే విధంగా సిద్ధిపేట మునిసిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ -1 మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.ప్రసన్నరాణి గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ పొందారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేస్తున్న ఎ.విజయలక్ష్మి వరంగల్ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు.

వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల వద్దకే వైద్యులు


కూలీలకు చికిత్స చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

నెక్కొండ, జూలై 30 : వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉన్న కూలీల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది . మండలంలోని చంద్రుగొండ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరం, జలుబుతో బాధపడుతున్న 45 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను జరిపి మందులను అందించారు. అనంతరం చంద్రగొండ, గొల్లపల్లి గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలను జరపడానికి గ్రామంలోకి వైద్య సిబ్బంది వెళ్లారు. అయితే అప్పటికే వ్యవసాయ కూలీలు పనులకు వెల్లడంతో వైద్య సిబ్బంది కూలీలకు వైద్య సెవలను అందించుటకు వరి పొలాల వద్దకే వెళ్లారు. కూలీ పనుల్లో నిమగ్నమైన కూలీలకు వైద్య పరీక్షలు జరుపగా పలువురికి జ్వరం, జలుబు, వల్లు నొప్పులతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. వారికి చికిత్సలు జరిపి మందులను పంపిణీ చేశారు. నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రహిలాతస్వీర్, డాక్టర్ సుమన్, డాక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


బెల్లం పానకం, గుడుంబాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నర్సంపేట టౌన్, జూలై 30 : ప్రజలు నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా, డీసీపీ రవీందర్ ఆదేశాల మేరకు నర్సంపేట ఏసీపీ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు నర్సంపేట మండలం గార్లగడ్డతండాలో మంగళవారం కార్డెన్ సెర్చ్ (కమ్యూనిటీ రీచ్ ప్రోగ్రాం) నిర్వహించారు. ఈ సందర్భంగా 800 లీటర్ల బెల్లం పానకం, 15 లీటర్ల గుడుంబా, నెంబర్ ప్లేట్ లేని 15 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, చట్టాల లోబడి ఉండాలన్నారు. సైబర్‌క్రైమ్, నార్కోటిక్ గంజాయి, ట్రాఫికింగ్, డయల్ 100, 1930 సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ రమణమూర్తి, సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతుతోనే నేరాల నివారణ సాధ్యం

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట రూరల్, జూలై 30 : పోలీసులకు ప్రజల మద్దతు ఉంటేనే నేరాలు నివారణ చేయడం సాధ్యమవుతుందని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ల్యాబర్తి గ్రామంలో వెస్ట్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. పోలీసుల తనిఖీల్లో అంబర్, గుట్కా ప్యాకెట్స్, రూ. 12,320 విలువ గల మద్యం సీసాలు, నంబర్, పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, గూడ్స్ వాహనం, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. అనంతరం గ్రామ కూడలిలో ప్రజలతో మాట్లాడారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి, గుట్కాలు అమ్మిన, కొనుగోలు చేసిన చట్టరీత్యా నేరమన్నారు. ఇసుకను సైతం అక్రమ మార్గంలో తరలించవద్దని గుర్తు చేశారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అమలు చేస్తూనే నేరస్థుల పాలిట సైతం పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏ సీపీ అంబటి సాంబయ్య

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కొనసాగించాలి

నెక్కొండ, జూలై 30 : నెక్కొండ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉన్న సికింద్రాబాద్- గుంటూరు, గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ను ఈ నెల 30 నుంచి రైల్వే అధికారులు రద్దు చేశారు. ఇంటర్‌సిటీకి నెక్కొండలో హాల్టింగ్ ఉన్నప్పటికీ రెవెన్యూ అంతగా రావడం లేదన కారణం చూపుతూ హాల్టింగ్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఇంటర్‌సిటీ హాల్టింగ్ కొనసాగించాలని కొనసాగించాలని రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరుతూ నెక్కొండ రైల్వే అవేర్నెస్ ఫోరం సభ్యులు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. సంబంధితాధికారులు టికెట్ల ద్వార వస్తున్న ఆదాయం విషయాన్ని పరిశీలించి ఇంటర్‌సిటీ హాల్టింగ్ ఇపించాలని వారు కోరారు. కాగా నెక్కొండ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉన్న సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ పునరుద్ధరించలంటూ సీనియర్ డివిజనల్ వాణిజ్య మేనేజర్ ఐ. బాలాజీకిరణ్‌కు సికింద్రబాద్ రైల్ నిలయంలో వినతి పత్రాన్ని నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ మంగళవారం అందించారు.

మెడికల్ షాపుల తనిఖీ


మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

నర్సంపేట. జూలై 30 : నర్సంపేట పట్టణంలోని పలు మెడికల్ షాపులను వరంగల్ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు. అధికారులు అరవింద్‌కుమార్, కిరణ్, పావని ఆధ్వర్యంలో ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులను సందర్శించారు. మెడికల్ షాప్స్ డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అని తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారి వివరణ సరిగ్గా లేకపోతే చర్యలు తీసుకుంటామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్‌కుమార్ తెలిపారు.

విధులపై అలసత్వం వహించొద్దు

రాయపర్తి, జూలై 30 : వైద్యులు, సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి, రోగుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జ్వరాల బారిన పడుతున్న ప్రజలకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలోని గ్రామాల్లో సైతం ఎప్పటికప్పుడు ఏఎన్ఎంలు, ఆశాలు మందుల పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి వర్షికి, హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ కిషన్ నాయక్, స్టాఫ్ నర్సు రజిత, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం


సన్మానించిన డ్రైవర్లతో అధికారులు

నర్సంపేట, జూలై 30 : ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించడం జరిగిందని నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి తెలిపారు. నర్సంపేట డిపోలో విధుల పట్ల అంకిత భావంతో పనిచేసిన డ్రైవర్లను ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. ఎలాంటి ప్రమాదాలు జ రుగకుండా బస్సులు నడిపిన పి.భాస్కర్, ఎం.సాంబయ్య, టి.గోవర్ధన్‌లకు ఆర్టీసీ రిజియన్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ విజయభానుతో కలిసి వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా శాలువాలు కప్పి సన్మానించినట్లు తెలిపారు. డ్రైవర్ల అభినందన కార్య క్రమంలో నర్సంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ భవాని. అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, ఎస్‌డిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

చెన్నారావుపేట, జూలై 30: పరిసరాల పరిశుభ్రదతోనే వ్యాధుల నివారణ ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని బోడ మాణిక్యంతండా, చెరువుకొమ్ముతండాలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సంధ్యారాణి, వైద్య సిబ్బంది వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ రామెల్, సురేందర్ , లింగమూర్తి, లలిత, కవిత, ఆశాకార్యకర్తలు. అలాగే సూర్యపేటతండాలో సీఎస్ఐ వరంగల్ గ్రూప్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్స్ ఛైర్ పర్సన్ రెవ సుప్రియ సర్వేష్ పాల్, డాక్టర్ సరోజ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్లొస్తున్నారని శుభ్రతపై దృష్టి

ఇల్లందలో సెంట్రల్ టీం పర్యటన

వర్ధన్నపేట రూరల్, జూలై 30 : గత కొన్ని నెలలుగా పరిశుభ్రతపై, గ్రామ సమస్యలపై పట్టించుకోని అధికారులు, సెంట్రల్ టీం వస్తున్నారని తెలియడంతో గ్రామంలోని కొన్ని వార్డుల్లో పరిశుభ్రత పై దృష్టి సారించారు. మంగళవారం మండలంలోని ఇల్లంద గామంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ పరిశీలనలో రెండో రోజు కేంద్ర అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం పర్యటన సందర్భంగా ఈ విషయం బయటపడింది. రెండో రోజు పర్యటనలో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు, వాటి విదానాల, రిజిస్టర్‌ల నిర్వహణ, జాబ్ కార్డుల నిర్వహణ, ప్లాంటేషన్, నర్సరీలు, రైతు వేదిక, వైకుంఠధామం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వాటి తీరుతెన్నులు తెలుసుకున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను ఎంపీడీవో వెంకటరమణ వారి అధికారి బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో చూపించారు.

ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా అందించినవారికే గుర్తింపు

నెక్కొండ, జూలై 30 : ప్రజలకు నిస్వార్థంగా ప్రభుత్వ సేవలను అందించిన అధికారులను ప్రజలు గుర్తింస్తారని నర్సంపేట ఎంపీవో సునిల్‌రాజ్, సూపరిండెంట్ ప్రవీన్‌కుమార్ అన్నారు . పదవి విరమణ పొందిన నెక్కొండ ఎంపీడీవో కక్కెర్ల వీరేశ్ దంపతులను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గజమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రాజ్‌కుమార్, రాజేశ్, ఏపీఎం శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో జాకోబ్, నెక్కొండ ఎంపీడీవో సూపరిండెంట్ దయాకర్, కార్యదర్శులు సదానందం, రవళి, అరుణ్, రవికుమార్, మధు,రాకేశ్, నరేష్, మహేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 30: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖతోపాటు మునిసిపల్, పంచాయతీ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలిజేయాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించిస్తూ ఇళ్లు, సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి నిల్వ ఉన్న నీటిని బయట పారబోసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలపై చైతన్యం కల్పించాలని డీఆర్‌డీవోను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటర మణ, డీఈవో వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, గిరిజన సంక్షేమ, మైనారిటీ శాఖ అధికారి సౌజన్య, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు పుష్ప, భాగ్యలక్ష్మీ, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి, జూలై 30: మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో నైట్ వాచ్‌ఉమెన్, స్వీపర్ కమ్ స్కావెంజర్, హెడ్‌కుక్ పోస్టుల నియామకానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో చదువుల సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే మహిళలు పర్వతగిరి మండలానికి చెందినవారై ఉండాలని, 18-45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు పదో తరగతి పాసై సెక్యూరిటీ ఏజెన్సీలో అనుభవం ఉండాలని, హెడ్‌కుక్ పోస్టుకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత పత్రాలతో జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 4 వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నజియా సల్మా 7680946704 నెంబర్‌లో సంప్రదించాలని వారు ఆప్రకటనలో తెలిపారు.

● దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లిలోని కస్తూర్బా విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న మహిళ పోస్టులైన డే వాచ్ ఉమెన్, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నేటి నుంచి ఆగస్టు 4వ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో కోరారు. దరఖాస్తులు చేసుకు నే మహిళలు మండల పరిధి గ్రామాలకు చెందిన వారై ఉండాలని, డే వాచ్ ఉమెన్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్కావింజర్‌కు 7వ తరగతి చదివి ఉం డాలన్నారు. మహిళలు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని ఆసక్తి కలిగిన వారు కస్తూర్బా విద్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

పర్వతగిరి, జూలై 30: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అరటిపండ్లు పంపిణీ చేశారు. శిక్షా సప్తాలో భాగంగా ఈరోజు తిథి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నోడల్‌ఆఫీసర్ లింగారెడ్డి మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మహంకాళి రామస్వామి తన తల్లి మహంకాళి ఎల్లమ్మ స్మారకార్థం ఉభయ పాఠశాలల విద్యార్థులకు అరటిపండ్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీచైర్మన్ బొట్ల గీత, హెచ్ఎంలు పాక రమేష్‌బాబు, రమణారెడ్డి పాల్గొన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం

పర్వతగిరి, జూలై 30: మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలానికి వెళ్లడంతో ఆయనకు మంగళవారం పశువైద్యశాలలో పలువురు రైతులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. పదేళ్లపాటు పశువైద్యాధికారిగా సేవలందించడంతో ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు. ఆయన స్థానంలో నూతనంగా పశువైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రాజుకు స్వాగతం పలికారు.

మహాసభను బహిష్కరించిన దళిత నేతలు

దుగ్గొండి, జూలై30: మండలంలోని తొగర్రాయిలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో దళిత వాడలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాన్ని ఎక్కువ మంది అధికారులు హాజరు కాలేదని దళిత నేతలు సభను బహిష్కరించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలిపారు. పౌరహక్కుల దినోత్సవానికి మండల స్థాయి అన్ని రకాలశాఖ అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ రవిచంద్రారెడ్డి ముందస్తుగా అధికారులకు సమాచారం అందించినప్పటికి పశువైద్యాధికారి, స్థానిక కార్యదర్శి హాజరు కావడంపై దళిత నేతలు సభను బహిష్కరస్తున్నట్లు ప్రకటించి నిరసన తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

నల్లబెల్లి, జూలై 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని ఆఫీస్ ఎదుట కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టారనే సమా చారంతో ఎస్సై మంగళవారం బడిని సందర్శించారు. ఆయా వస్తు వులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థు లనుద్దేశించి ఎస్సై ప్రశాంత్‌బాబు మాట్లాడారు. క్షుద్ర పూజ లాంటి వదంతులు సరైనవి కాదన్నారు. అలాగే ఉపాధ్యా యులకు తగు సూచనలు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

నర్సంపేట టౌన్, జూలై 30 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నర్సంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. నర్సంపేట మండలం మహేశ్వరానికి చెందిన నాగమల్ల స్వాతి(35)-రమేష్ దంపతులు గత కొన్నేళ్లుగా నర్సంపేట పట్టణంలోని ద్వారకపేట రోడ్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. రమేష్ పట్టణంలో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత కరోనా సమయంలో రమేష్ వ్యాపారం రూ. 20 లక్షల వరకు నష్టపోవడం జరిగింది. నాటి నుంచి ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో స్వాతి మనోవేదనకు గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలి


తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతి పత్రం అందిస్తున్న ముదిరాజ్ కుల నేతలు

దుగ్గొండి, జూలై 30. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి నిధు లు కే టాయించాలని, దానికి ముదిరాజ్ కులస్థుడినే చైర్మ న్‌గా నియమించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెపైన అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళ వారం ముదిరాజ్ కులస్థులచే భారీ ర్యాలీ నిర్వహించి వివి.ధ రకాల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీ ల్దార్ కార్యా లయంలో డీటీ ఉమారాణికి అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఏడాదికి రూ.1000 కోట్లు కేటాంచాలని, 75శాతం సబ్సిడీపై వాహనాలు, ఇతర సామాగ్రి అందించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షు డు పొన్నం మొగిలి, రాష్ట్ర ఎన్ఆర్ఐ ముదిరాజ్ సంఘం కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు జింకల కుమార్, మండల అధ్యక్షుడు పల్లె రమేశ్, గోనెల నరహరి, హంస విజయ రామారాజు, ముత్యాల స్వామి, సోడ సమ్మయ్య, సార రాములు, మంద భిక్షపతి, నేదురు రాజేందర్, లక్క రమేశ్, తుమ్మలపెల్లి మహేందర్, దండు రాజు, గొర్రె రామకృష్ణ,చందు తదితరులు పాల్గొన్నారు.